సాక్షి
వికారాబాద్
శనివారం । 13 । జూలై । 2024



విధులు భారం..

రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలన్నా ముందుగా గుర్తొచ్చేది గ్రామ కార్యదర్శులే. 10లో▸

మీ సేవలో ఇక క్యాష్‌లెస్

మీ సేవ కేంద్రాల్లో పౌరులకు పారదర్శకత సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. 10లో▸



మూత'బడి'..

ఉపాధ్యాయులు లేక పాత కొడంగల్‌లోని ప్రాథమిక పాఠశాల మూతపడింది. దీంతో విద్యార్థుల చదువు సాగడం లేదు. 11లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన గురునాథ్‌రెడ్డి



ముఖ్యమంత్రికి బొకే అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి తదితరులు

కొడంగల్ రూరల్: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే ఆర్ గురునాథ్‌రెడ్డి శుక్రవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, వీరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన మల్టీజోన్ ఐజీ



ఐజీకి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయాన్ని మల్టీజోన్ ఐజీ వి.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి ఐజీకి మొక్కను బహూకరించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై ఎస్పీతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి: షఫీఉల్లా



మాట్లాడుతున్న షఫీఉల్లా

అనంతగిరి: జిల్లాలో వనమహోత్సవ లక్ష్యాన్ని ఛేదించాలని గ్రామీణాభివృద్ధి స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వన మహోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అంతకుముందు పూడూరు మండలం మిర్జాపూర్‌లోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడి నుంచి వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్, బృహత్ పల్లె ప్రకృతి వనం, పండ్ల తోటలు, వాటర్‌షెడ్ పనులను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం నర్సింగరావు, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ పాల్గొన్నారు.

కురియన్ కమిటీ సభ్యులతో తాండూరు ఎమ్మెల్యే భేటీ




తాండూరు: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చించడానికి వచ్చిన కురియన్ కమిటీ సభ్యుల ఎదుట శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ హైకమాండ్ ఎంపీ ఎన్నికల్లో గెలుపోటములను తెలుసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వచ్చిన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

సీఎం సభా స్థలి ఏర్పాట్ల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని లష్కర్ గూడలో ఆదివారం నిర్వహించనున్న సీఎం సభ స్థలాన్ని కలెక్టర్ శశాంకతో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వం తరఫున అందించే 'కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్న విషయం తెలిసిందే.

ఫీజుల మోత



ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు

- నిబంధనలకు నాలుగింతలు ఎక్కువ..
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- ఎక్కడా కనిపించని ప్రభుత్వ ఫీజు చార్ట్
- జిల్లాలో 185 ప్రైవేటు స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య 45,000

వికారాబాద్: ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమవుతోంది. ప్రభుత్వ ఫీజు చార్టును పక్కన పెట్టి ఎవరికి తోచిన రీతిలో వారు ఫీజులు వసూలు చేస్తున్నారు. స్లిప్ టెస్టులు, ఇతర పరీక్షలు నిర్వహించే సమయంలో బకాయి ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను వేధిస్తున్నారు. అడిగినంత ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయనిస్తామంటూ కండీషన్ పెడుతున్నారు. ఫీజు చెల్లించని వారిని పరీక్షలు రాయనివ్వకుండా గంటల తరబడి నించోబెడుతున్నారు. లేదంటే ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్లాలని ఆదేశిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఫస్ట్ టర్మ్ ఫీజు పేరుతో విద్యార్థులను వేధించటం మొదలు పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయడం లేదు. ఒకవేళ పాఠశాలను తనిఖీ చేసినా విద్యార్థులతో గాని తల్లిదండ్రులతో గాని మాట్లాడిన దాఖలాలు లేవు. ప్రైవేటు స్కూళ్లు నిబంధనలకు నీళ్లొదులుతూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేస్తున్నారు. విద్యాశాఖ సూచించిన ఫీజ్ చార్టుకు ఆరు నుంచి ఎనిమిది రెట్లు అధికంగా వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. జిల్లాలో అధికారికంగా 185 ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఇందులో 45,000 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కట్టడిలో విఫలం

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనలో డీలా పడుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగించటడంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఆయా పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇంటర్, డిగ్రీలో ఆయా గ్రూపులకు సంవత్సరానికి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు వసూలు చేస్తుండగా.. పాఠశాల విద్యలో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు సంవత్సరానికి రూ.30 వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో ఎల్‌కేజీ పిల్లలకే ఏకంగా సంవత్సరానికి రూ. 30 వేలకు పైగా ఫీజు వసూలు చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎస్ వన్, ఎస్ టూ, ఎఫ్ వన్, ఎఫ్ టూ, ఎఫ్ త్రీ, ఎఫ్ ఫోర్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతిసారీ ఫీజుల కోసం విద్యార్థులను పీడిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలి. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, ఇతర ఏ వస్తువులు విక్రయించరాదు. అనుమతులు లేకుండా నడిపే పాఠశాలలకు నోటీసులు ఇస్తాం. అధిక ఫీజుల విషయంలో తల్లిదండ్రులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. ఫీజుల విషయంలో అన్ని పాఠశాలలకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

ఫీజు చార్టు ఇలా..

చివరగా 2018–19 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఫీజుల చార్టు విడుదల చేసింది. అయితే యాజమాన్యాలు ఇవేవీ పాటించడం లేదు. విద్యాశాఖ విడుదల చేసిన ఫీజు చార్ట్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ. 650, సంవత్సరానికి రూ.7,800 వసూలు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.750, ఏడాదికి రూ.9 వేలు తీసుకోవాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 900, ఏడాదికి రూ.10,800, పట్టణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.1000, ఏడాదికి రూ. 12,000 తీసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే పాఠశాలలు కల్పించే సౌకర్యాలను బట్టి 10 శాతం అదనంగా తీసుకోవచ్చని పేర్కొన్నారు. కానీ ఇవేవీ అమలు కావడం లేదు.

బదిలీలకు కసరత్తు పూర్తి

- నేటి నుంచి వెబ్ ఆప్షన్లు
- రెవెన్యూ శాఖలో స్వల్పంగానే..
- పంచాయతీరాజ్‌లో 40 శాతం వరకు ఛాన్స్
- పోస్టింగ్‌ల కోసం ఉన్నతాధికారుల పైరవీలు

వికారాబాద్: వారం రోజులుగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా ఆయా శాఖల అధికారులు కసరత్తును పూర్తి చేశారు. నేటి నుంచి (శనివారం) ప్రభుత్వం ఉద్యోగులకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. రాష్ట్రంలో దశాబ్ద కాలంగా సాధారణ బదిలీలు జరగలేదు. తాజాగా ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్లకు అడ్డుగా ఉన్న బ్యాన్ ఎత్తి వేయడంతో లైన్ క్లియర్ అయ్యింది. ఈ నెల 20లోగా బదిలీల ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులు కసరత్తును ముమ్మరం చేశారు. 40 శాతానికి మించకుండా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలన్న ఆదేశాలు అందాయి. దీంతో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జిల్లా అధికారులందరూ బదిలీ కానున్నారు.

రెవెన్యూలో కొందరికే ఛాన్స్

జిల్లాలో లాంగ్ స్టాండింగ్ ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఎన్నికల సమయంలో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ప్రస్తుత బదిలీల్లో వారికి అవకాశం లేదు. సాధారణంగా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలంటే ప్రస్తుతం పని చేస్తున్న చోట రెండు సంవత్సరాలు పూర్తయి ఉండాలి. అదే నాలుగేళ్లు పూర్తయితే వెబ్ ఆప్షన్ పెట్టుకోకపోయినా బదిలీ చేస్తారు. జిల్లాలో ఇద్దరు డీటీలు మాత్రమే రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. పై నిబంధనల ప్రకారం వీరు మాత్రమే వెబ్ ఆప్షన్ పెట్టుకునే అవకాశం ఉంది. ఒకేచోట నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సీనియర్ అసిస్టెంట్లు 10 మంది ఉన్నారు. వీరికి బదిలీ తప్పనిసరి. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లలో ఒకే చోట నాలుగేళ్లు, మరో ఎనిమిది మంది రెండేళ్లు పూర్తయినందున బదిలీ అయ్యే అవకాశం ఉంది. రెండేళ్లు పూర్తి చేసుకున్న ఒకే టైపిస్టు ఉండటంతో వెబ్ ఆప్షన్ పెట్టుకునే అవకాశం ఉంది. ఇక ఆఫీస్ సబార్డినేట్లలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారు 22 మంది ఉండగా రెండేళ్లు పూర్తయిన వారు 13 మంది ఉనఆనరు.

పంచాయతీరాజ్‌లో..

జిల్లాలో 566 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇందులో గ్రేడ్ వన్ కార్యదర్శులు ఆరుగురు ఉండగా ఇద్దరు బదిలీ అయ్యే అవకాశం ఉంది. గ్రేడ్ టూ 26 మంది ఉండగా ఒక్కరికే ఛాన్స్ ఉంది. గ్రేడ్ త్రీలో 75 మంది ఉండగా 44 మందికి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం ఉంది. గ్రేడ్ ఫోర్‌లో అత్యధికంగా 499 మంది కార్యదర్శులు ఉండగా 310 మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. అయితే 40 శాతం బదిలీలు దాటకూడదనే నిబంధన ప్రకారం ఇందులో 120 మందిని సీనియారిటీ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫర్ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో గ్రేడ్ వన్ నుంచి గ్రేడ్ త్రీ వరకు జోనల్ పోస్టు కావడంతో వారి ఆప్షన్లు మ్యాన్యువల్‌గా తీసుకుని కమిషనర్‌కు పంపించారు. గ్రేడ్ ఫోర్త్ కార్యదర్శుల ఆప్షన్లు ఇప్పటికే స్వీకరించిన జిల్లా అధికారులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు స్క్రూటినీ చేసి 19, 20 తేదీల్లో వారికి బదిలీ ఆర్డర్లు ఇవ్వనున్నారు.

పాతుకుపోయిన కొందరు

కొందరు అధికారులు ఏడెనిమిది సంవత్సరాలుగా జిల్లాలోనే పాతుకుపోయారు. వారిని బదిలీ చేయకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. తహసీల్దార్ క్యాడర్‌కు చెందిన ఓ అధికారి కలెక్టరేట్‌లో ఎనిమిదేళ్లుగా ఏఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పలుసార్లు జరిగిన బదిలీల్లో ఆయన మినహాయింపు పొందుతూ వచ్చారు. ప్రస్తుత జాబితాలో అతని పేరు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అతని సోదరుడిని కూడా ఇక్కడ కార్యాలయంలోనే ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా కీలక పోస్టులో నియమించారు.



బొంపల్లి పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- దోమ, బొంపల్లి, బాస్‌పల్లి పాఠశాలల సందర్శన

దోమ: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బొంపల్లి, బాస్‌పల్లి, దోమ పాఠశాలలను సందర్శించారు. బొంపల్లి పాఠశాలలో వంట గదిని, వాటర్ సంప్, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం లేదని హెచ్‌ఎం వెంకట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని మాజీ సర్పంచ్ సురేశ్, మాజీ ఎంపీటీసీ రాములు కలెక్టర్‌కు తెలిపారు. ఇది కోర్టు పరిధిలో ఉందని, త్వరలో నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. అనంతరం బాస్‌పల్లి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం దోమ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు సూచించారు.మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రాలేదని కార్మికులు కలెక్టర్‌కు విన్నవించారు. బిల్లుల కోసం ఆందోళన చెందాల్సిన పని లేదని త్వరలో వస్తాయని తెలిపారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడారు. సబ్సిడీ రుణాలపై ఆరా తీశారు. ఆ తరువాత కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. అక్క డి బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మిష న్ భగీరథ ఈఈ పార్థసారథి, ఎంపీడీఓ మహేశ్ బాబు, తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈఓ హరిశ్చందర్ పాల్గొన్నారు.

నారాయణపూర్, ఘనాపూర్‌లో

టెక్స్‌టైల్ పార్కులు

- త్వరలో భూ సేకరణ
- పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



ధారూరు: సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణ చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేరెల్లి, ధారూరు గ్రామాల్లో రూ.10 లక్షలతో నిర్మించిన వాష్ రూంలు, అల్లీపూర్‌లో రూ. 1.10 కోట్లతో నిర్మించనున్న బీటీ, సీసీ రోడ్లకు, రూ.2.82 కోట్లతో కుక్కింద ఎక్స్ రోడ్డు నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ధారూరు రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడి పోయిందన్నారు. అప్పులతో రాష్ట్రాన్ని అప్పగించారని పేర్కొన్నారు. వీటన్నింటినీ అధిగమించి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. నారాయణపూర్, ఘనాపూర్‌లో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం త్వరలో భూమి సేకరిస్తామని పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పథకాల అమలు ఆగిపోయిందని, ఆగస్టు 15 నుంచి అన్నీ ప్రారంభం అవుతాయని అన్నారు. ఎమ్మెల్యే కోటా కింద ప్రతి నియోజకవర్గానికి 3,600 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని, స్పీకర్‌గా తనకు అదనంగా మరో 3,600 ఇళ్లు వస్తాయని తెలిపారు. అర్హులైన అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. కార్యక్రమంలో మల్టీ జోన్ -2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ధారూరు, హరిదాస్‌పల్లి సొసైటీల చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, సీనియర్ న్యాయవాది సంపూర్ణ ఆనంద్‌రావు, మాజీ జెడ్పీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

అనంతగిరి: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్నదాతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు షరీఫ్, కౌన్సిలర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆసరాగా పోస్టల్ బీమా

- సికింద్రాబాద్ పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

తాండూరు టౌన్: పాలసీ పొందిన వ్యక్తి ప్రమాదానికి గురైనప్పుడు, లేదా చనిపోయినప్పుడు బాధిత కుటుంబానికి పోస్టల్ బీమా ఆసరాగా నిలుస్తుందని సికింద్రాబాద్ పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం తాండూరు పోస్టాఫీసులో బీమా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం రూ.520 చెల్లించి టాటా బీమా తీసుకున్న వారికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. శాశ్వత వైకల్యం పొందిన లేదా ప్రమాదవశాత్తు మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయి ఇన్సూరెన్సు అందజేస్తామన్నారు. చికిత్స నిమిత్తం రూ.లక్ష వరకు, అలాగే మృతి చెందిన సభ్యుల పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ప్రజలు పోస్టాఫీసు బీమా చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన రాములుగౌడ్ కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు.అలాగే అరుణకు రూ.2 లక్షలు, చాంద్‌మియాకు రూ. 91వేల విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ క్రాంతి, పోస్టు మాస్టర్ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.



మహిళకు బీమా చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారులు

ఏ'పుణ్య'మో ఫలించిన వేళ

- నెల రోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు బాలుడు
- అప్పగించిన బీహార్ చైల్డ్ హోం అధికారులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న బీహార్ చైల్డ్ హోమ్ అధికారులు

కొడంగల్ రూరల్: పుణ్యక్షేత్రాల సందర్శనలో నెల రోజుల క్రితం తప్పిపోయిన బాలుడు శుక్రవారం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొడంగల్ మండలం అన్నారం గ్రామంలో సంపూర్ణ రామాయణం ప్రదర్శన అనంతరం.. పాత్రధారులు 40 మంది నెల రోజుల క్రితం కాశీ, అయోధ్య పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. అయోధ్య, కాశీ దర్శనాల అనంతరం గ్రామానికి చెందిన వడ్డె రాములు తోపాటు ఆయన కుమారుడు తప్పిపోయారు. అప్పట్లో గ్రామస్తులు నాలుగు రోజుల పాటు ఇద్దరి ఆచూకీ కొరకు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఫలితం లేక అన్నారం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అయోధ్య జంక్షన్ దగ్గర బాలుడి తండ్రి రాములు మతిస్థిమితం కోల్పోయి కనిపించాడు. బాలుడి విషయం అడిగినా రాములు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆయన్ను వెంటబెట్టుకుని స్వగ్రామం చేరుకున్నారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం యత్నించారు. నాలుగు రోజుల క్రితం బాలుడి తల్లిదండ్రులు, నలుగురు గ్రామస్తులు అయోధ్యకు వెళ్లారు. బీహార్ రాష్ట్ర చిల్డ్రన్ హెల్ప్ లైన్ ద్వారా ఓ బాలుడు హైదరాబాద్, వికారాబాద్, కొడంగల్, అన్నారం పేర్లను చెబుతున్నాడని, వికారాబాద్ జిల్లా అధికారులకు బాలుడు ఉన్నట్లు సమాచారం అందింది. ఇక్కడి చైల్డ్ హోమ్ వాళ్లు విచారించి స్థానిక పోలీసుల సాయంతో అన్నారం గ్రామానికి చెందిన బాలుడిగా గుర్తించారు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో అయోధ్య ప్రాంతంలో వెతుకుతున్న కుటుంబ సభ్యుల తోపాటు గ్రామానికి చెందిన వడ్డె వెంకటప్ప, పట్నం అంజి, వీరేష్ తదితరులు అక్కడికి చేరుకుని బాలుడిని గుర్తించారు. బీహార్ చైల్డ్ హోమ్ అధికారులు వివరాలు పరిశీలించిన అనంతరం శుక్రవారం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు చేరడంతో నెల రోజులుగా ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులకు ఉపశమనం కలిగింది.

క్లుప్తంగా

పది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

దౌల్తాబాద్: మండల పరిధిలోని నీటూరులో శుక్రవారం మధ్యాహ్నం పది మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలో జట్టురి కనకప్ప ఇంట్లో పది మంది గ్రామస్తులు పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్‌ఐ రవిగౌడ్ తన సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేశారు. రూ.29,500 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుట్కాలు విక్రయిస్తే జైలు శిక్ష

ఎస్‌ఐ గిరి



సీజ్ చేసిన గుట్కాలను చూపుతున్న ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటుగా జైలుకు పంపస్తామని పెద్దేముల్ ఎస్‌ఐ గిరి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని తన సిబ్బందితో కలిసి ఆకస్మిక సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సురేష్ కిరాణా దుకాణంలో తనిఖీలు చేపట్టగా 1,680 గుట్కా ప్యాకెట్లను పట్టుకుని సీజ్ చేశారు. వాటి సుమారు రూ.3,710 ఉంటుందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి అదృశ్యం



మొగులప్ప(ఫైల్)

పెద్దేముల్: మండల పరిధిలోని రుక్మాపూర్‌లో వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం ఆయన భార్య పెద్దేముల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మొగులప్ప ఈ నెల 9న పొలం పనులకు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొగులప్ప గతంలో సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేశాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఆందోళన చెందిన భార్య కండెనోళ్ల శ్రీలత పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

సామాజిక సేవలకు ఉత్తమ అవార్డు



మాజీ సర్పంచ్ పెంటయ్య

పూడూరు: సామాజిక సేవలకుగాను మండల పరిధిలోని తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ పెంటయ్య జాతీయ సేవా రత్న అవార్డుకు ఎంపిక య్యారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్ తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ హాల్‌లో నిర్వహించే భారతీయ కళా ఉత్సవ్ -2024 పురస్కారాల వేడుకలో అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో విశేష సేవలు అందించిన తాను సేవారత్న అవార్డుకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఆసరా పింఛన్ల పెంపునకు పోరాడండి

కందుకూరు: ఆసరా పింఛన్లను పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య శుక్రవారం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం అందించారు. ఆసరా పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తు న్నా పెంపు ఊసే లేదని ఈ సందర్భంగా ఆయ న ఎమ్మెల్యేకు వివరించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పక్షాన పోరాడాలని కోరారు.

విధుల భారం.. నిధులు పూజ్యం

అన్ని శాఖల బాధ్యతలు కార్యదర్శులవే..

- అప్పు చేసి పంచాయతీల పనులు
- ఖర్చు పెట్టిన సొమ్ము వస్తదో లేదో అని ఆందోళన

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలన్నా ముందుగా అధికారులకు గుర్తొచ్చేది గ్రామ కార్యదర్శులు. పంచాయతీరాజ్ శాఖ తరపున వీరిని నియమించినా అన్ని శాఖల పనులు చేయాల్సిన పరిస్థితి. గతంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సహాయకులు, వీఆర్‌ఓలు ఉండేవారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి వివిధ పథకాల అమలు, సమాచార సేకరణ, గ్రామాల్లో సాంఘిక, సామాజిక అంశాల వివరాలు సేకరించి రెవెన్యూ శాఖకు అందించేవారు. కానీ గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను రద్దు చేయడంతో పనుల భారమంతా పంచాయతీ కార్యదర్శులపై పడింది.

ఆర్థిక భారం.. పని ఒత్తిడి

గ్రామ పంచాయతీల్లో ఏ పనిచేయాలన్నా నిధులు ఉండాలి. ఆరు నెలలుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి నిధులు రావడంలేదు. ఈ ఏడాది జనవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. అప్పటి నుంచి పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోయాయి. కానీ పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యాలను నిర్దేశిస్తూ గడువులోగా పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో కార్యదర్శులు ఆర్థికభారంతో పాటు పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు.



గోకఫసల్‌వాద్ పంచాయతీ కార్యాలయం

ఇతర శాఖల పనులు చేయాల్సిందే..

పంచాయతీ కార్యదర్శులు తమ శాఖ రోజువారీ విధులతో పాటు ఇతర శాఖల పనులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం మిషన్ భగీరథకు సంబంధించి సర్వే చేస్తున్నారు. మరుగుదొడ్ల వ్యవసాయశాఖ సర్వేలను సైతం కార్యదర్శులకు అప్పగించారు. వాటితో పాటు విద్యాశాఖకు సంబంధించిన మరి కొన్ని పనులు కట్టబెట్టారు. ఇప్పటికే మౌలిక వసతుల కల్పన పరిశుభ్రత తదితర పనులు నిర్వహించాల్సి వస్తుంది. గ్రామాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సంబంధించి విచారణ బాధ్యతలు వీఆర్‌ఓలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో ఆ పనులు సైతం కార్యదర్శులపైనే మోపారు. గ్రామాల్లోని వివాహాలను రిజిస్టర్ చేయడం, సంబంధిత ధ్రువపత్రాల జారీ చేయడం, వివాహం జరిగిన గ్రామం, ప్రదేశం తదితర అంశాలను విచారణ చేసి ధ్రువీకరించడం లాంటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పనిభారం తగ్గించాలి



పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పనులే కాకుండా ఇతర శాఖల పనులు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం పంచాయతీలకు సర్పంచులు లేక చాలా ఇబ్బందిగా ఉంది. ప్రతీ పని తామే చేయించాల్సి వస్తోంది. ఆర్థిక భారం అధికమవుతోంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– సంతోష్, పంచాయతీ కార్యదర్శి, గుముదాల

మీ సేవలో ఇక క్యాష్‌లెస్

యూపీఐ ద్వారానే చెల్లింపులు

- పారదర్శకతకు పెద్దపీట వేసేందుకే డిజిటల్ లావాదేవీలు

దౌల్తాబాద్: మీ సేవ కేంద్రాల్లో పౌరులకు పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్ లేదా టీ వ్యాలెట్ ద్వారా చెల్లింపులు చేసేలా షెడ్యూల్‌లో మార్పిడి చేపట్టింది.

కీప్యాడ్ ఫోన్‌లే అధికం

గ్రామీణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ చెల్లింపులపై మహిళలు, వద్దులకు అవగాహన తక్కువ. ఈ పరిస్థితుల్లో మీసేవ నిర్వహకులే తమ ఫోన్‌ల ద్వారా లావాదేవీలు పూర్తి చేయాలి. మీసేవ కేంద్రాల నిర్వాహకులకు రోజుకు 10 దరఖాస్తుల వరకు ఫోన్ ద్వారా క్యూ ఆర్ స్కాన్‌తో డబ్బుల చెల్లించడానికి అవకాశం కల్పించారు. ఒక ఫోన్ నుంచి పది లావాదేవీల కంటే ఎక్కువగా జరగడంలేదని నిర్వాహకులు అంటున్నారు. పల్లెల్లో 80శాతం ప్రజలు నగదు లావాదేవీలే నిర్వహిస్తారు. ఇప్పటికీ కీప్యాడ్ ఫోన్‌లు వాడే వారే అధికంగా ఉన్నారు. వారు యూపీఐతో దరఖాస్తు రుసుములు చెల్లించలేని పరిస్థితి. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని కేంద్రాల్లో క్యూఆర్‌కోడ్‌తో పాటు నగదు లావాదేవీలు సైతం అనుమతించాలని పలువురు కోరుతున్నారు.

పల్లె వాసులతో ఇబ్బంది

మండలంలో 15 తండాలు, 30 పంచాయతీలున్నాయి. పల్లె వాసులకు దరఖాస్తు పత్రం నింపడంలోనే ఇబ్బంది పడుతుంటారు. ఇక నగదు రహిత లావాదేవీలంటే వారు మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుంది. క్యూఆర్ కోడ్ మంచిదే అయినప్పటికీ నగదు లావాదేవీలకు సైతం అనుమతిస్తే ఇబ్బంది అధిగమించవచ్చు.

– నాగప్ప, మీ సేవ నిర్వాహకుడు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పూడూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మన్నెగూడకు చెందిన చాకలి ప్రశాంత్(30) ఈ నెల 3న ఎన్కేపల్లి హిట్స్ కాలేజీ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య దమయంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యారంటీల పేరిట గారడీ

కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది

- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ గారడీ చేసి ప్రజలను మోసం చేసిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో పరిస్థితులు అధ్వానంగా మారాయన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఎనిమిది నెలలైనా చెల్లించలేదన్నారు. రైతు భరోసా అందక పోవడంతో రైతులకు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి ఇప్పుడు నిరుద్యోగులను పోలీసు లాఠీలతో కొట్టిస్తున్నారన్నారు. నిరుద్యోగులు ఉద్యమిస్తున్నా ఏ ఒక్కరు వచ్చి పలకరించిన పాపన పోలేదన్నారు. నిరుద్యోగుల పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. తాండూరు ప్రాంత అభివృద్ధి అధ్వాన్నంగా మారిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను రూ.1,582 కోట్ల నిధులను మంజూరు చేయించానని గుర్తు చేశారు. తన హయాంలోనే తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మించామని.. మరోవైపు కరన్‌కోట్ రోడ్డు పనులకు సిద్ధం చేయించామన్నారు. తాండూరు ప్రాంత అభివృద్ధి కోసం తాను మంజూరు చేయించిన ప్రతీ పనిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముందుకు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, నాయకులు శ్రీశైల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసచారి, విజయ్‌కుమార్, ఇందర్‌చెడ్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

స్తంభం పైనుంచి పడి.. జీపీ కార్మికుడి మృతి

వీధి లైట్లు బిగిస్తుండగా కరెంట్ షాక్



వెంకటప్ప (ఫైల్)

పెద్దేముల్: స్తంభాలపై వీధి లైట్లు బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఇందూరులో శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. జీపీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటప్ప(40) మల్టీ పర్పస్ విధుల్లో భాగంగా శుక్రవారం ఏడు స్తంభాలకు లైట్లు ఫిట్ చేసి ఎనిమిదో స్తంభం ఎక్కగా షాక్ కొట్టడంతో పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాడీని తాండూరులోని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రాత్రి 8గంటలకు పెద్దేముల్ ఎస్‌ఐ గిరిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.



వెంకటప్ప మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

చేవెళ్ల: పాల ప్యాకెట్లు సప్లయ్ చేయడానికి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామరగిద్ద గ్రామానికి చెందిన చాకలి వీరయ్య కుమారుడు చాకలి రాజేశ్(17) సాయంత్రం పూట స్థానిక డెయిరీ వ్యాపారి దగ్గర పాల ప్యాకెట్లు సప్లయ్ చేసేవాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన మిత్రులు వినయ్, అభిషేక్‌లతో కలిసి రాజేశ్ ఒకే బైక్‌పై సప్లయ్ చేయడానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చేవెళ్లలోని మోడల్ కాలనీ వద్ద వీరి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనకాల కూర్చున్న రాజేశ్ ఎగిరి పోయి పక్కన ఉన్న చెట్టుకు తగలడంతో, అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రాజేశ్‌ను వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యానికి మొయినాబాద్‌కు, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అర్ధరాత్రి రాజేశ్ మృతి చెందాడు. మరోపక్క వినయ్ తీవ్రంగా గాయపడగా, అభిషేక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి వీరయ్య శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి తేల్చేందుకు సర్వే

వెంచర్‌పై వచ్చిన ఆరోపణలతో రెవెన్యూ అధికారుల చర్యలు

కందుకూరు: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మండలంలోని పెద్దమ్మతండా వెనకనున్న పులిమామిడి రెవెన్యూలో ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై అధికారులు చర్యలు ఉపక్రమించారు. ఈ మేరకు శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 77లో ఉండాల్సిన 7.13 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయించారు. కాగా అటు పులిమామిడి ఇటు మహేశ్వరం మండలం ఆకాన్‌పల్లికి చెందిన రెవెన్యూలోకి ఓవర్ ల్యాపింగ్ వచ్చినట్లుగా గతంలో అధికారులు భావించారు. ప్రస్తుతం చేసిన సర్వేలో ఏమైందనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. కాగా సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు తదితరులు

భార్యను పుట్టింట్లో దింపి వస్తుండగా..

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

బంట్వారం: భార్యను పుట్టింటిలో దింపి వస్తుండగా బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం కోట్‌పల్లి మండల పరిధిలోని ఓగులాపూర్ గేట్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ స్రవంతి తెలిపిన ప్రకారం.. ధారూరు మండలం హౌసుపల్లికి చెందిన పరిగి లాలయ్య(41) భార్య భారతమ్మతో కలిసి పెద్దేముల్‌కు వెళ్లాడు. భారతమ్మను పుట్టింటిలో దింపి స్వగ్రామానికి వస్తుండగా తాండూరు వైపు వెళ్తున్న లారీ లాలయ్య బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లాలయ్య తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో తాండూ రు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్య లో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు లా రీ డ్రైవర్ సుందర్‌పై కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడు.. శవమై తేలాడు



హాజీ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఈతగాళ్లు

బషీరాబాద్: చేపల వేటకు వెళ్లి చెక్‌డ్యాంలో గల్లంతైన యువకుడు శవమై తేలాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని జీవన్గీ బర్కల్‌కు చెందిన హాజీ(30) గురువారం కాగ్నా చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన విషయం విదితమే. శుక్రవారం ఉదయం మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు గాలింపు చేపట్టగా నీటి అడుగుభాగంలోని రాళ్లలో ఇరుకున్నాడు. శవాన్ని బయటకు తీయడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య నసీమా, పిల్లలు సానియా, రఫీక్ ఉన్నారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమేష్‌కుమార్ అన్నారు.

మృతికి కారకుడైన డ్రైవర్‌కు మూడేళ్ల జైలు

యాచారం: నిర్లక్ష్యంగా కారును నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన డ్రైవర్‌కు శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.1,500 జరిమానా విధించింది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా అనుముల మండలం శాంతినగర్‌కు చెందిన రాంచంద్రయ్య 2018లో నగరం నుంచి మాల్‌కు కారులో వెళ్తున్నాడు. నగరంలోని మీర్‌పేటకు చెందిన గోవింద్ నారయ్య, గోవింద్ వినయ్ మోటార్ సైకిల్‌పై మాడ్గుల్‌కు వెళ్లి తిరిగి మీర్‌పేటకు వస్తున్నారు. మార్గమధ్యలో మాల్ గ్రామానికి సమీపంలో కారులో వెళ్తున్న రాంచంద్రయ్య ఎదురుగా బైక్‌పై వస్తున్న నారయ్య, వినయ్‌లను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నారయ్య తీవ్ర గాయాలైన మృతి చెందగా, వినయ్ గాయాలతో బయటపడ్డాడు. ఇదే విషయమై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలతో ఇబ్రహీంపట్నం కోర్టులో సమర్పించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం శుక్రవారం రామచంద్రయ్యకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రైతువేదిక, చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య, కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు, ఎంపీడీఓ రామకృష్ణ, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డిప్యూటీ తహసీల్దార్లు రమేశ్, వెంకటగిరి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్–2 అధ్యక్షుడు భరత్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, చౌడాపూర్ మండల అధ్యక్షులు అశోక్ కుమార్, కుల్కచర్ల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సరిహద్దు సమస్యను పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని ఇరు రాష్ట్రాల సమన్వయంతో పరిష్కరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో ప్రతీక్‌జైన్‌ను కలిశారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తాండూరులో నెలకొన్న సమస్యలను వివరించారు. దీంతో సీఎం కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌ను కలిసి తాండూరు పట్టణంలో కుక్కల బెడద అరికట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి షెడ్ నిర్మించి వీధి కుక్కలను కట్టడి చేస్తామన్నారు. షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రాంటు నిధులను ఇస్తానని కలెక్టర్‌కు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి ఎర్రమట్టి అవసరమవుతోందని.. కాంట్రాక్టర్లకు ఎర్రమట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అటవీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలన్నారు. బషీరాబాద్ మండలంలో కర్ణాటక–తెలంగాణ సరిహద్దుల ప్రాంతంలో భూ సమస్యలున్నాయని ఎవరికీ నష్టం కలగకుండా సంయుక్త సర్వే నిర్వహించి సమస్య పరిష్కరించాలని కోరారు. తాండూరు మున్సిపల్ పరిధిలో చిలుకవాగుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. చిన్న వర్షానికే కాలనీలు జలమయమవుతున్నాయని వివరించారు. చిలుక వాగు పనుల పునరుద్ధరణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు జరిపించేలా చూస్తానని కలెక్టర్ తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కోలుకుంటున్న విద్యుత్ ప్రమాద బాధితులు

పహాడీషరీఫ్: స్విమ్మింగ్ పూల్‌లో విద్యుత్ ప్రమాదం జరిగిన సంఘటనలో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పహాడీషరీఫ్ పోలీసులు తెలిపారు. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబం గురువారం జల్‌పల్లి మరాఠ భవన్ వెనకాల ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్ పూల్‌కు అనుకొని ఉన్న ఈత చెట్టు కొమ్మలు ఈదురు, గాలుల వల్ల హై టెన్షన్ వైర్‌కు తాకాయి. దీంతో చెలరేగిన నిప్పు రవ్వలతో హై టెన్షన్ వైర్ తెగి స్విమ్మింగ్ పూల్‌లోని నీళ్లల్లో పడి విద్యుదాఘాతం సంభవించింది. దాదాపు 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరికి మాత్రం కాలిన గాయాలు ఎక్కువగా ఉండడంతో కుటుంబ సభ్యులు వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం ఆగదు!



దుద్యాల్ స్టేజి వద్ద కండక్టర్‌తో మహిళల వాగ్వాదం

ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశ పెట్టిన నాటి నుంచి నిత్యం ఏదో విధంగా ప్రయాణాలు వార్తల్లోకి ఎక్కుతున్నాయి. ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి దుద్యాల్ గేట్ దగ్గర సరిగా బస్సులు నిలపడం లేదు. శుక్రవారం గంటపాటు వేచి ఉన్న ప్రయాణికులు బస్సుకు అడ్డుగా నిల్చుని బస్ ఎక్కి డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. మహిళలు కనిపిస్తే బస్సు ఖాళీగా ఉన్నా బస్సు నిలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

– దుద్యాల్